క్లుప్తంగా

శరవేగంగా పంపుహౌస్ నిర్మాణ పనులు



తాడేపల్లిరూరల్ (మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తెనాలి రోడ్డులో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పంప్‌హౌస్‌కు సోమవారం కాంక్రీట్ పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని మంగళగిరిలో వచ్చే వేసవికాలం తాగునీటిని పుష్కలంగా అందించేందుకు మరో పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టామని, నెల రోజుల్లో ఈ పనులు పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

జలపాలేశ్వరునికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాస కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు ఉమాపతిశాస్త్రి స్వామికి అంగన్యాస, కరన్యాసాలతో అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బోరింగ్ పంపులకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్ (నవులూరు): మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరులో బోరుపంపులు మరమ్మతులకు గురైనట్టు సచివాలయ సిబ్బందికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఎంటీఎంసీ వాటర్‌వర్క్ సిబ్బంది ఆ బోరు పంపులకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు.

నిడమర్రులో రూ.50 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



తాడేపల్లిరూరల్ (నిడమర్రు) : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు తాడికొండ రోడ్డులో డ్రెయినేజీ నిర్మించేందుకు కార్పొరేషన్ అధికారులు సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. దీనిలో భాగంగా సోమవారం నిడమర్రు తాడికొండ రోడ్డును ఆక్రమించుకుని నిర్మించుకున్న షాపులను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ డ్రెయిన్ నిర్మించడం వల్ల నిడమర్రులోని చాలా ప్రాంతాల్లో మురుగునీటి సమస్య తొలగుతుందని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ఈవీఎం గిడ్డంగి పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారు మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను ఆర్డీఓ ప్రభాకరరెడ్డి సోమవారం పరిశీలించారు. సాధారణ తనిఖీలలో భాగంగా గోడౌన్ బయట ఉన్న తాళాల పటిష్టతను, విద్యుత్ సరఫరా వ్యవస్థను, సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. భద్రత కల్పిస్తున్న పోలీసు సిబ్బంది రిజిస్టర్‌ను తనిఖీచేశారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మనాభుడు, సిబ్బంది పాల్గొన్నారు.

డీ ఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ ఫార్మసీ డిప్లొమా కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లకు ఫిబ్రవరి రెండో తేదీన స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటోస్టాట్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందే విద్యార్థినులకు ఫీజు రాయితీ ఉండదని వివరించారు.

మహాత్మా వందనం

వాడవాడలా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి



తాడికొండలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ (మంగళగిరి) : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని పలుచోట్ల సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. గాంధీ విగ్రహాలకు ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా.. నీరాజనం అంటూ నినదించారు.

- మంగళగిరిలోని ఆరో పటాలములో బెటాలియన్ కమాండెంట్ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండ్ ఈఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు, బెటాలియన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- మంగళగిరి కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేవస్థానం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు గోలి నాగకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కూర్మాల దుర్గాప్రసాద్, నాయకులు గోలి సాంబశివరావు, గండికోట వెంకయ్య, బొడ్డు రామారావు తదితరులు పాల్గొన్నారు.
- నిడమర్రులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

తాడికొండ: అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గాంధీజీ మార్గం అనుసరణీయమని తాడికొండ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనియాడారు. సోమవారం మండల కేంద్రమైన తాడికొండలో గాంధీజీ 75వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బుశ్శెట్టి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వనమా వేణుగోపాలరావు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం





క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఏపీ, తెలంగాణ డాన్ బాస్కో సంస్థల ప్రావిన్షియల్ ఫాదర్ శాన్తియాగు థామస్, తదితరులు

తాడేపల్లిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఏపీ, తెలంగాణ డాన్‌బాస్కో విద్యా సంస్థల ప్రావిన్షియల్ ఫాదర్ శాన్తియాగు థామస్ చెప్పారు. డాన్‌బాస్కో వర్ధంతి సందర్భంగా మంగళగిరి మండలం యర్రబాలెం డాన్‌బాస్కో స్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా థామస్ మాట్లాడుతూ 137 దేశాలలో 3,600 పాఠశాలలు ఉన్నాయని, ప్రతి విద్యార్థిని మంచిగా, నిజాయితీగా తీర్చిదిద్దేలా డాన్‌బాస్కో విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. కబడ్డీ విభాగంలో చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచి 10,116 రూపాయలు, పెనుమాక జెడ్పీ హైస్కూల్ జట్టు రన్నర్‌గా నిలిచి 5,116 రూపాయలు అందుకున్నాయి. కార్యక్రమంలో రాయల్ గ్యాస్ నిర్వాహకులు నన్నపనేని నాగేశ్వరరావు మహిళా నాయకురాలు వల్లభనేని వాణి, ఫాదర్లు చిన్నప్ప, మర్రిరెడ్డి, జోస్, ప్రధానోపాధ్యాయులు ఫాతిమా రాణి, ఖయ్యుమ్ బాషా, పీఈటీలు పి. కిషోర్‌బాబు, కె.పాల్‌రాజు, సాంబశివరావు పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవం

మేడికొండూరు: విశదల అడ్డరోడ్డు వద్ద ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

8వ వార్డులో బోరుపంపునకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొండ ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన బోరు పంపులకు కార్పొరేషన్ వాటర్ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. 8వ వార్డులో ఉన్న బోరుపంపు గత కొంతకాలంగా నీళ్లు రాకపోవడంతో స్థానిక ప్రజలు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. బోరుపంపులో ఉన్న పైపులు తుప్పు పట్టి లీక్ కావడంతో బోరు పంపు నుంచి నీరు రావడం లేదని, ఆ పైపులను తొలగించి కొత్త పైపులు వేసి తాగునీటిని పునరుద్ధరించినట్లు సిబ్బంది తెలిపారు.

పెదపాలెంలో చిరుధాన్యాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండలం పెదపాలెంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ పి.రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2018లో చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని గుర్తించిందని చెప్పారు. ప్రస్తుతం మనం తినే ఆహారం రసాయన ఎరువులతో పండించడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని వివరించారు. చిరు ధాన్యాలైన కొర్రలు, సామలు, అండుకొర్రలు, ఊదలు, రాగులు, సజ్జలు, జొన్నలను పండించడమే కాకుండా వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, గుంటూరు ఏడీఏ జి.ప్రవీణ్, ఏవో ఎన్.శ్రీవాణి, దుగ్గిరాల ఎంఏఓ పి.శిరీష, ఏఈఓలు కె.శ్రీనివాస్, ఎ.రమేష్‌బాబు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ డి.అలేఖ్య, ఎంపీఈఓ సౌమిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు రుణాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. సోమవారం కుంచనపల్లి గ్రామంలో పాడి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు రైతు నాయకులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామంలోని పాడి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, పాడిరైతు రామిశెట్టి అంకమ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మృతి



తాడేపల్లిరూరల్ (మంగళగిరి) : మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన మంద్రు వెంకటేశ్వరరావు (86) సోమవారం కన్నుమూశారు. వెంకటేశ్వరరావు పట్టణ మైత్రి సంఘం అధ్యక్షులుగా, గుమాస్తాల సంఘం అధ్యక్షులుగా, వీవర్స్ ప్రాజెక్ట్ సొసైటీ అధ్యక్షులుగా, వాటర్ స్కీమ్ అధ్యక్షులుగా బహుముఖ సేవలు అందించారని పద్మశాలీయ సంఘం నేతలు చెప్పారు. వెంకటేశ్వరరావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొన్నాళ్లుగా అస్వస్థతతో ఉన్న వెంకటేశ్వరరావు వయోభారంతో మరణించడంతో నగరంలో పద్మశాలీ సంఘం నేతలు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌కు చెందిన టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ చూపించినట్లు కోచ్ విష్ణుమొలకల సంఘవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న హనుమాన్ జంక్షన్‌లోని కాకాని కల్యాణ మండపంలో జరిగిన ఫస్ట్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో సుందరయ్యనగర్‌లోని టైగర్ పవర్ క్లబ్‌కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, మొత్తం 26 జిల్లాల్లోనూ 800 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా సుందరయ్యనగర్ విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. 63 కేజీల విభాగంలో పెద్దపాటి బేబి భవ్యశ్రీ ప్రథమ స్థానం, మైనస్ 30 కేజీల విభాగంలో నంద్యాల వెంకట శాలిని మొదటి స్థానం, 40 కేజీల విభాగంలో పోలూరు వెంకట వర్ధిని ప్రథమ స్థానం, 35 కేజీల విభాగంలో పట్టేటి ఉదయ్‌కిరణ్ ప్రథమస్థానం, 40 కేజీల విభాగంలో దొంత పవన్ శశాంక్ కుమార్ మొటిస్థానం, 60 కేజీల విభాగంలో చిట్టికిరెడ్డి దినేశ్వర్ ప్రథమస్థానం, 35 కేజీల విభాగంలో ముంజేటి నరేంద్ర మొదటి స్థానం, 30 కేజీల విభాగంలో బంకాల రోహిత్ వెంకట్ కుమార్ మొదటిస్థానం, 45 కేజీల విభాగంలో బంకల మౌర్యతేజ మొదటిస్థానం, 63 కేజీల విభాగంలో మహమ్మద్ అషపునీసా రెండవ స్థానం, 30 కేజీల విభాగంలో ముంజేటి వర్ధిని ద్వితీయ స్థానం దక్కించుకున్నారని ఆమె తెలిపారు.

గుండిమెడలో శ్మశానవాటికకు జంగిల్ క్లియరెన్సు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడలో సోమవారం హిందూ శ్మశాన వాటికలో కార్పొరేషన్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గుండిమెడలో హిందూ శ్మశాన వాటికలో ముళ్ల పొదలు పెరిగి అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందిగా ఉందని మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డికి కొందరు రాతపూర్వకంగా విన్నవించారు స్పందించిన ఆయన కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డితో మాట్లాడి కార్పొరేషన్ జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో జంగిల్ క్లియరెన్సు చేపట్టారు.

కుష్ఠు వ్యాధి చికిత్సతో దూరం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి యానీగ్రేస్

ఫిరంగిపురం: కుష్ఠువ్యాధిని చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యానీగ్రేస్ అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్పర్శ కుష్ఠు వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ యానీగ్రేస్ మాట్లాడుతూ శరీరంపై రాగి రంగు మచ్చ ఉండి స్పర్శ లేకుండా ఉంటే దానిని వ్యాధి లక్షణాలుగా భావించి ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారికి తెలియజేస్తే మందులు అందజేస్తారని చెప్పారు. ప్రతిగ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రాథమికంగా గుర్తించి తెలియజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.నాగమల్లేశ్వరి, సీహెచ్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగుంట్లపాడులో..

యర్రగుంట్లపాడు గ్రామంలోని సచివాలయం వద్ద నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలల వద్ద ప్రజలకు ఆరోగ్య సిబ్బంది కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

కుష్ఠు నిర్మూలనలో భాగస్వాములు కావాలి



తాడేపల్లిరూరల్ (మంగళగిరి): కుష్ఠు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ వి.రాజేష్ చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్ఠు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌సీ ఈఓ మనోహర్‌తోపాటు పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో గుంతలో పడి వ్యక్తి మృతి

మేడికొండూరు: మద్యం మత్తులో గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఫిరంగిపురం మండలం అమినాబాద్ గ్రామానికి చెందిన షేక్ నజీర్ (60) ఉపాధి కోసం పేరేచర్లలో టైలరింగ్ పని చేసేందుకు వస్తుంటాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి పేరేచర్ల జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లే కాలువ కట్టవద్ద దిమ్మెపై కూర్చొని మద్యం సేవించి అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో పడ్డాడు. రాత్రి సమయం కావడంతో అతన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం కాలువ కట్టపై వెళ్తున్న కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

గడప గడపలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి



డ్రెయినేజీ సమస్యలను పరిశీలిస్తున్న ఏఈ రమేష్ తదితరులు

తాడేపల్లిరూరల్ (మంగళగిరి): మంగళగిరి పట్టణ పరిధిలోని 3వ సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం ఎంటీఎంసీ ఏఈ రమేష్ ఆ సచివాలయ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. నాంచారమ్మ చెరువులోకి గతంలో మురుగునీరు వెళ్లడంతో ఆ నీటిని మళ్లించేందుకు, ఎస్ఎల్ఎం చైతన్య పాఠశాల నుంచి మూడో సచివాలయం శివారు వరకు సీసీ రోడ్ నిర్మాణం, ఇతర సమస్యలకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని, మూడో సచివాలయ పరిధిలో గడప గడప కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిశీలించి పనులు చేపట్టనున్నట్లు ఏఈ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది అజయ్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి స్వామికి పవళింపు సేవ



పవళింపు సేవలో శ్రీ భావనారుషి స్వామి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పద్మశాలీయ కల్యాణ మండపంలోని భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం అనంతరం సోమవారం పవళింపు సేవ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పవళింపు సేవా మహోత్సవాన్ని తిలకించారు. విశ్వశాంతి కళాపరిషత్ ఆధ్వర్యంలో పౌరాణిక నాటకం, శివభక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, రాయల గ్యాస్ కంపెనీ అధినేత నన్నపనేని నాగేశ్వరరావు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వూట్ల సాంబశివరావు, మునగాల వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు కుమారస్వామి, మునగాల రమేష్, వెంకటేష్, పొట్లబత్తుని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావును, కళాకారులను సత్కరించారు.

హిందూ శ్మశాన వాటికలో గ్రావెల్ ఫిల్లింగ్



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం హిందూ శ్మశాన వాటికలో ఎంటీఎంసీ నిధులతో గ్రావెల్ ఫిల్లింగ్ పనులు చేపట్టారు. గతనెలలో రూ.10 లక్షలతో నిధులు కేటాయించి రెండు వైపులా ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. శ్మశాన వాటికలో కొండవీటి వాగు ఒడ్డు వరకు జంగిల్ క్లియరెన్స్ నిర్వహించి మరో రూ.10 లక్షలతో గ్రావెల్ ఫిల్లింగ్ పనులు చేపట్టారు.

బీజేపీని పటిష్టం చేయాలి

దగ్గుబాటి పురంధరేశ్వరి

నెక్కల్లు(తాడికొండ): రాబోయే ఎన్నికల్లో బలం నిరూపించుకోవాలంటే పార్టీని బూత్ లెవల్ నుంచి పటిష్టం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధరేశ్వరి చెప్పారు. సోమవారం తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్థాయిలో పోలింగ్ బూత్ కమిటీలను వేయడంతోపాటు నెలకోసారి సమావేశాలు నిర్వహించడం ద్వారా పార్టీని కింది స్థాయి నుంచి పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూపూడి రంగరాజు, అమ్మిశెట్టి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, లోక్‌సభ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం 4వ రోజుకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి తిరుమంజన సేవ, హయగ్రీవ హోమం నిర్వహించారు. రామచంద్ర మూర్తిని గజ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.